# మీ ఇంటి ఆడబిడ్డగా.. నన్ను ఆశీర్వదించండి




ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి హరిప్రియ, గ్రామాల్లో ప్రచారం చేస్తున్న హరిప్రియ, జడ్పీ చైర్‌పర్సన్ బిందు, నాయకులు

## ఇల్లెందు బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బానోత్ హరిప్రియానాయక్

గార్ల, నవంబర్ 3: మీలో ఒకరిగా, మీ కష్టాల్లో తోడుగా ఉన్న నన్ను మీ ఇంటి ఆడబిడ్డగా నన్ను ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించాలని ఇల్లెందు నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి బానోత్ హరిప్రియా నాయక్ అన్నారు. శుక్రవారం గార్ల మండలంలోని పుల్లూరు, బీఆర్ఎన్‌తండా, రాజు తండా, కోట్యా నాయక్ తండా, పోచారం గ్రామాల్లో జడ్పీ చైర్‌పర్సన్ అంగోత్ బిందూతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తొలుత గ్రామాల్లో హరిప్రియకు హారతులతో మహిళలు, ప్రజా ప్రతినిధులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా హరిప్రియ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలల్లోకి విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని కార్యకర్తలకు సూచించారు. అభివృద్ధి చూసి ఓర్వలేని కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. ఉమ్మడి ఏపీలో 70 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ తెలంగాణ ప్రజలను చిన్న చూపు చూసిందన్నారు. తొమ్మిదిన్నరేండ్ల తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందు వరసలో సీఎం కేసీఆర్ ఉంచారని తెలిపారు. దేశంలో ఎక్కడలేని విధంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను సీఎం కేసీఆర్ అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ మ్యానిఫెస్టో ప్రజల గుండెల్లో ఉందన్నారు. రైతులకు మూడు గంటలు కరెంట్ చాలు అని చెప్పిన కాంగ్రెస్ నాయకులను గ్రామాల్లో తిరగకుండా తరిమికొట్టాలన్నారు. మాజీ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ కుమార్‌రెడ్డి రైతు బంధు, దళితబంధు పథకాలను నిలిపి వేయాలని ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడం దుర్మార్గమన్నారు. ఇల్లెందులో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభను అక్క చెల్లెలు, అన్నదమ్ము లు భారీ సంఖ్యలో వచ్చి నన్ను ఆశీర్వాదించారని వారికి జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. మీ ఆశీర్వాదంతో రెండోసారి ఎమ్మెల్యే అయి మీ రుణం తీర్చుకుంటానన్నా రు. సీఎం కేసీఆర్ సార్ దయతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానన్నారు. రాంపురం హై లెవల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.15 కోట్లు మంజూరు చేసి శంకుస్థాపన చేశామన్నారు. కమలాపురం వద్ద బ్రిడ్జి నిర్మాణానికి 4.80కోట్లు మంజూరు చేయించానన్నారు. ఈ నెల 30 వ తేదీన జరిగే ఎన్నికల్లో మీ అమూల్యమైన ఓటు కారు గుర్తుకు ఓట్లు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఐదేళ్లు మీకు సేవ చేసే భాగ్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మూడు శివాజీ చౌహన్, ఎంపీటీసీ శీలంశెట్టి రమేశ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్ నాయక్, రైతుబంధు సమితి మండల కన్వీనర్ పానుగంటి రాధకృష్ణ, నాయకులు మందనపు భాస్కర్‌రావు, తోట కొండల్ రావు, కోట ఉత్తరయ్య, గాజుల గణేశ్, రమేశ్, సర్పంచ్‌లు మాలోత్ జ్యోతి, ప్రవళిక, మోతిలాల్, శ్రీను, రాంబాయి, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



హరిప్రియకు బొట్టుపెట్టి ఆశీర్వదిస్తున్న మహిళలు,

**యాడీ.. పింఛన్ వస్తుందా.. వస్తుంది బిడ్డా..**

మండలంలోని పుల్లూరు , బీఆర్ఎన్‌తండా, పోచారం, కోట్యా నాయక్‌తండా, రాజు తండాల్లో ఇల్లెందు నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి హరిప్రియా నాయక్ గిరిజనులను అప్యాయంగా పలకరిస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. యాడీ పింఛన్ వస్తుందా...అంటూ గిరిజనులతో లంబాడీ భాషలో మాట్లాడారు. వారు వస్తుంది బిడ్డా అన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి నన్ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

## తొలిరోజు నామినేషన్ వేసిన స్వతంత్ర అభ్యర్థి రవి

ఇల్లెందు, నవంబర్ 3: ఈ నెల 30వ తేదీన జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో నామినేషన్‌ల ప్రక్రియ శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఇల్లెందు అసెంబ్లీ నియోజకవర్గం 111(ఎస్టీ) కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి జే కాశయ్య శుక్రవారం ఉదయంఎన్నికల నోటిఫికేషన్ జారీ చేశారు. ఎన్నికల నియమావళి షెడ్యూల్ నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ స్టేషన్లలో ఉంచామన్నారు. తొలిరోజు శుక్రవారం యూనిటీ సెంటర్ ఆఫ్ కమ్యూనిస్టు రెవల్యూషనరీస్ ఆఫ్ ఇండియా (యూసీసీఆర్ఐ-ఎంఎల్) పార్టీకి చెందిన స్వతంత్ర అభ్యర్థి కామేపల్లి మండలం మద్దులపల్లి గ్రామానికి చెందిన పోలెబోయిన రవి తన నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి జే కాశయ్యకు దాఖలు చేశారు.

## ఓటు హక్కును వినియోగించుకోవాలి




మాట్లాడుతున్న స్వీప్ సభ్యులు

ఇల్లెందు, నవంబర్ 3: కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరూ ఓటు వినియోగించుకోవాలని పట్టణంలో శుక్రవారం స్వీప్ (సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్) ఆధ్వర్యంలో కళాజాతా బృందం సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించింది. నిజాయితిగా ఓటు వేయాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో బయ్యారం తహసీల్దార్ ఇమ్మానియేల్, ఇల్లెందు ఎంపీడీవో బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## అమరవీరుల ఆశయాల సాధన కోసం కృషి చేయాలి



అమరవీరుల స్థూపం వద్ద నినాదాలు చేస్తున్న నాయకులు

టేకులపల్లి, నవంబర్ 3: పీడిత ప్రజల విముక్తి కోసం సాగుతున్న విప్లవోద్యమంలో అసువులు బాసిన అమరవీరుల ఆశయాల సాధన కోసం కృషి చేయాలని న్యూడెమోక్రసీ నాయకుడు బానోత్ ఊక్లానాయక్ అన్నారు. శుక్రవారం టేకులపల్లిలో కాచినపల్లి అమరవీరుల స్థూపం వద్ద మండల కార్యదర్శి కల్తీ వెంకటేవ్వర్లు అధ్యక్షతన జరిగిన అమరవీరుల సంస్మరణ సభలో ఏఐకేఎంఎస్ నాయకుడు భూక్య హర్జనాయక్ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకుడు బానోత్ ఊక్లానాయక్, ఇఫ్టూ నాయకుడు దుబాకుల ప్రసాద్ మాట్లాడుతూ ఈ నెల 1నుంచి 9వ తేదీ వరకు సంస్మరణ సభలు నిర్వహిస్తున్నామని, వారి ఆశయాల సాధనకై ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీవైఎల్ డివిజన్ కార్యదర్శి నోముల భానుచందర్, ఇస్లావత్ రమేశ్, సజ్జన్, బన్ని తదితరులు పాల్గొన్నారు.

## తొలిరోజు జిల్లాలో మూడు నామినేషన్లు



కొత్తగూడెం ఆర్డీవో కార్యాలయంలో స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసిన ఉదయ్‌కుమార్

భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 3 (నమస్తే తెలంగాణ) : అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల పర్వం ప్రారంభమైంది. తొలిరోజు జిల్లాలో ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. భద్రాచలం, అశ్వారావుపేట, పినపాకలో ఒక్కరూ కూడా నామినేషన్లు వేయలేదు. ఇల్లెందులో ఒకరు, కొత్తగూడెంలో ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు దాఖలు చేశారు. ఇల్లెందులో పోలిబోయిన రవి, కొత్తగూడెంలో గుండపనేని సతీశ్, ఇమంది ఉదయ్‌కుమార్ నామినేషన్లు వేశారు.

## పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం



పంచామృతాభిషేకం జరుపుతున్న అర్చకులు

పాల్వంచ రూరల్, నవంబర్ 3 : మండలంలోని కేశవాపురం- జగన్నాధపురం గ్రామాల మధ్య ఉన్న పెద్దమ్మతల్లి ఆలయంలో శ్రీకనకదుర్గ అమ్మవారికి అర్చకులు శుక్రవారం పంచామృతాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయం ఎదురుగా ఉన్న అమ్మవారి జన్మస్థలం వద్ద మేళతాళాలతో ప్రత్యేక పూజలు చేసి అమ్మవారికిష్టమైన పసుపు, కుంకుమ, గాజులు, ఒడిబియ్యం సమర్పించారు. ఆలయంలోని మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, పంచహారతులు, నివేదన, నీరాజన మంత్రపుష్పం నిర్వహించారు. పంచహారతుల కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఈవో రజనీకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ మహీపతి రామలింగం, ధర్మకర్తలు పాల్గొన్నారు. ఈ నెల 11వ తేదీ శనివారం ఆలయంలోని యాగశాలలో రుద్ర హోమం నిర్వహిస్తున్నట్లు ఈవో తెలిపారు.

# గ్రామదేవతల విగ్రహాల ప్రతిష్ఠ




విగ్రహాల ప్రతిష్ఠాపనకు వస్తున్న పూజారులు, భక్తులు, పూజల్లో పాల్గొన్న సర్పంచ్ ఇందిర దంపతులు, భక్తులు

టేకులపల్లి, నవంబర్ 3: మండలంలోని రాంపురం పంచాయతీ పాతతండాలో గ్రామదేవతల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని శుక్రవారం సర్పంచ్ భూక్యా ఇందిర ఆధ్వర్యంలో నిర్వహించారు. సర్పంచ్ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాతతండా రాంనగర్‌లో నాభిశీల శీతల పరమేశ్వరి (బొడ్రాయి), ముత్యాలమ్మ అమ్మవారి ప్రతిష్ఠ వైభవంగా జరిగిందని అమ్మవారి ఆశీస్సులు మాగ్రామంపై ఉండి పాడిపంటలు, పశుసంపద, విద్యా వైద్యం, ఆరోగ్యం అన్ని సమృద్ధిగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బానోత్ సరోజిని, గ్రామ పెద్దలు భూక్యా రమేశ్, బర్మావత్ శివకృష్ణ, సాగర్, పాల్గొన్నారు.

## రూ.10 నాణేలతో నామినేషన్

కొత్తగూడెం టౌన్, నవంబర్ 3 : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కొత్తగూడెం నియోజకవర్గం నామినేషన్ల తొలిరోజు ఆజాద్ అధికార సేన పార్టీ బలపరుస్తున్న అభ్యర్థి ఇమంది ఉదయ్‌కుమార్ నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ వేసే సమయంలో డిపాజిట్‌గా చెల్లించే రూ.10 వేలను వినూత్నంగా మొత్తం పది రూపాయల నాణేలను రిటర్నింగ్ అధికారికి ఇచ్చారు.



నామినేషన్ వేసేందుకు వెళ్తున్న ఉదయ్‌కుమార్